అధ్వానంగా రోడ్లు

● ఏడాదిగా తవ్వి వదిలేశారు

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

డ్రైనేజీ, వాటర్ పైపులైన్ ఏర్పాటు కోసం.. రోడ్ల అభివృద్ధి పేరుతో కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రోడ్లను తవ్వారు. పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత గోతులను మట్టితో తూతూ మంత్రంగా పూడ్చి వదిలేశారు. రోడ్లను నిర్మించక పోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షాల నేపథ్యంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని అంతర్గత రోడ్లపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..



మియాపూర్ పరిధిలోని చందానగర్ - పాపిరెడ్డికాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

మియాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో రోడ్లను తవ్వేసి ఎక్కడపడితే అక్కడ మట్టి కుప్పలుగా పోసి వదిలేశారు. నెలలు గడుస్తున్నా రోడ్ల నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. దీంతో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. కంకరతేలి గుంతలమయంగా మారిన రోడ్ల కారణంగా వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు పదినెలలుగా తవ్విన రోడ్లపై ప్రయాణం చేస్తూ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త పనులు మధ్యలోనే నిలిపివేశారు. బిల్లులు చెల్లించాలని వారు అనేకసార్లు నిరసన వ్యక్తం చేసినా జీహెచ్ఎంసీ నిధులు విడుదల చేయడం లేదు. ప్రధానంగా చందానగర్ హుడాకాలనీ నుంచి హఫీజ్‌పేట ఫ్లై ఓవర్ వరకు ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారు. పదినెలలుగా నిర్మాణం చేయకపోవడంతో రోడ్డు అస్తవ్యస్తంగా మారాయి. ఎంఏనగర్ అంతర్గత రహదారి, హఫీజ్‌పేటలోని అంతర్గత రహదారులు, పాపిరెడ్డికాలనీ, బీహెచ్ఈఎల్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా రోడ్లు గుంతలమయంగా మారాయి. అదేవిధంగా గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్లు ధ్వంసమై ఏడాదిగా జనం ఇబ్బందులు పడుతున్నారు.

తవ్వి వదిలేసిన రోడ్లతో ఇక్కట్లు



కూకట్‌పల్లి సర్కిల్ పరిధి వివేకానందనగర్‌కాలనీలో డ్రైనేజీ పైపులైను కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

కూకట్‌పల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లను తవ్వి వదిలేయడం పరిపాటిగా మారింది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్‌కాలనీలో రెండు నెలల క్రితం రోడ్డును తవ్వి డ్రైనేజీ పైపులైను వేసిన అధికారులు.. తర్వాత రోడ్డును పునరుద్ధరించడం మరిచారు. దీంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చందానగర్‌లోని అండర్‌పాస్ వద్ద దుస్థితి

నిరుపయోగంగా అండర్‌పాస్‌లు

చందానగర్: ప్రజలకు మెరుగైన రవాణా అందించడం కోసం కోట్లు వెచ్చించి అండర్‌పాస్‌లు నిర్మించారు. అనంతరం వాటి నిర్వహణ మరిచి పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చందానగర్ ఎంఎటీస్ చందానగర్ రైల్వేస్టేషన్ దగ్గర పలు కాలనీ వాసుల రాకపోకల కోసం అండర్‌పాస్‌లు నిర్మించారు. కానీ వర్షపునీటికి ఔట్‌లెట్ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి వరదనీరు భారీగా వచ్చి అండర్‌పాస్‌లో చేరుతుంది. దీంతో రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపునీటితో పాటు చెత్తాచెదారం పెద్దఎత్తున చేరుతుంది. అయినప్పటికీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో అండర్‌పాస్‌లు కంపు కొడుతోంది.

స్వీపింగ్ ఏదీ ?

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ జేఎన్‌టీయూలో రోడ్డులోని రాజీవ్‌గాంధీ ఫ్లై ఓవర్, హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి)లు చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. స్వీపింగ్ సరిగా లేకపోవడంతో గాలిదుమారం వచ్చినప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



జేఎన్‌టీయూ రోడ్డులోని రాజీవ్‌గాంధీ ఫ్లై ఓవర్‌పై ఇసుక, రాళ్లు, చెత్తాచెదారం.



నాలాపై కప్పులుతీసి రోడ్డుపైనే వేశారు

రోడ్డుపైనే చెత్తకుప్పలు.. మురుగునీరు

కుత్బుల్లాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం పేరుతో సిమెంట్ రోడ్లు తవ్వి నెలలు గడుస్తున్నా వాటిని నిర్మించడం లేదు. వర్షాకాలం రావడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి రామిరెడ్డినగర్ వెళ్లేదారిలో సిమెంట్ రోడ్డు తవ్వి వదిలేశారు. తిరిగి నిర్మించలేదు. అదే విధంగా నాలా పై కప్పును తొలగించి రోడ్డు పక్కన వదిలేశారు. మ్యాన్‌హోల్ పగిలిపోయి మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో తీవ్రమైన దుర్వాసనతో రామిరెడ్డినగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మురుగునీటిని కట్టడి చేయండి



రహదారిలో పొంగుతున్న డ్రైనేజీ

పేట్‌బషీరాబాద్: మురుగు నిత్యం రహదారిపై పరుగు పెడుతోంది. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన రహదారిలో పొంగుతున్న మురుగు నీటితో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

చెరువులను పరిరక్షించాలి: ఎమ్మెల్యే

నిజాంపేట్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చెరువులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామకుంట, ఎల్లబాయ్‌కుంట, జంగారికుంట, తుర్క చెరువులను సోమవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనిషి ప్రకృతితో మమేకమై జీవించినప్పుడే మనుగడ సాధ్యమని, భూమిలో నీటి నిలువలు పడిపోకుండా ఉండాలంటే చెరువులను పరిరక్షించాలని కోరారు. గతంలో నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బండారి లే-అవుట్ అంటే ముంపునకు గురయ్యే ప్రాంతంగా ముద్ర పడిందని, కానీ గత పదేళ్లలో వరద ముప్పును తొలగించడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ పి.రామకృష్ణారావు, డీఈలు దాసయ్య, శ్రీనివాస్, ఏఈ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు జ్యోతి నర్సింహారెడ్డి, ప్రణయ్ ధన్ రాజ్ మరి కొంతమంది పాల్గొన్నారు.



విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్‌కాలనీలోని బాల వికాస పాఠశాలకు చెందిన మూగ, చెవిటి విద్యార్థులకు సహస్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. సప్తగిరి కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేతుల మీదుగా సుమారు 130 మంది విద్యార్థులకు కళ్ల అద్దాలను అందజేశారు. సంస్థ ప్రతినిధి కృష్ణకిషోర్, శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, ఆంజనేయులు, బాబు మోహన్, మల్లేష్, శ్రావణిరెడ్డి పాల్గొన్నారు.

● **గణేశ్ ఆలయానికి రూ.లక్ష వితరణ**

మాదాపూర్ డివిజన్ పరిధి ఆదిత్యనగర్‌లోని సాయి గణేశ్ ఆలయ పునఃనిర్మాణ పనుల నిమిత్తం తనవంతు సాయంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, భార్గవ్, రాంచందర్‌మూర్తి, ఏడుకొండలు, హరి పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ఈఈగా లక్ష్మీగణేశ్



లక్ష్మీగణేశ్

కుత్బుల్లాపూర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ నూతన ఈఈగా లక్ష్మీగణేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేసిన లక్ష్మీగణేశ్ ఈఈగా బాధ్యతలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో అని ప్రాంతాలతో గణేశ్‌కు పరిచయం ఉంది.

గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రాయదుర్గం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. గోపన్‌పల్లి గ్రామం, రాజీవ్‌నగర్, కేశవనగర్, రాయదుర్గం, నల్లగండ్ల హుడాకాలనీలో సీసీ రోడ్ల సమస్యల పరిష్కరించాలని కోరారు. దీనికి జడ్‌సీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

'నీట్ పరీక్షను రద్దు చేసి విచారణ జరిపించాలి'

హైదర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి సంబరాలు చేసుకోవడం కాదని 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. నీట్ ఫలితాలు ముందు మే 14న ప్రకటిస్తామని చెప్పి చడీచప్పుడు లేకుండా సరిగ్గా ఎన్నికల ఫలితాలు వెల్లడించే రోజునే ప్రకటించడం ఎన్‌టీఏ అక్రమాలకు పాల్పడిందని అనుమానాలు ఉన్నాయన్నారు.

'హామీలు అమలు చేయకుంటే ఆందోళనలు'

గచ్చిబౌలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఎంసీపీఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ హెచ్చరించారు. సోమవారం శేరిలింగంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నగేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు హామీలను గమనించిన ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. ప్రజలకు గ్యాస్ సబ్సిడీ అందడం లేదని, మహిళలకు రూ.2500 ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో మురళీ, పుష్ప, రమేష్, నాగభూషణం, సుల్తానబేగం, రజియాబేగం, పార్వతి పాల్గొన్నారు.

వాహనాల చోరీ.. ఓఎల్ఎక్స్‌లో విక్రయం

● నకిలీ ఆర్సీలు సృష్టించి.. రూ.10 నుంచి 15 వేలకే అమ్మకం

● 14 వాహనాలు, ల్యాప్‌టాప్, నకిలీ ఆర్‌సీకార్డుల స్వాధీనం

● ముగ్గురు నిందితుల అరెస్ట్



వాహనాలను, నిందితులను చూపుతున్న డీసీపీ రోహిణిప్రియదర్శిని

బోయినపల్లి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ వాటికి నకిలీ రిజిస్ట్రేషన్ నెంబర్లను అమర్చి ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను బోయినపల్లి క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని నార్త్‌జోన్ డీసీపీ రోహిణిప్రియదర్శిని తెలిపారు. ఈ మేరకు సోమవారం బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. సూరారంకాలనీ కుత్బుల్లాపూర్ అమిత్‌బస్తీకి చెందిన రజాక్‌ఖాన్(38) బైక్ మెకానిక్. ఏలూరు కొండవోలె గ్రామానికి చెందిన యామాల యోహాను అలియాస్ యోహాను(29) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి మియాపూర్ హఫీజ్‌పేట్‌లో నివాసం ఉంటూ కార్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. ఈ క్రమంలో రజాక్‌ఖాన్‌కు యోహానుతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇద్దరూ కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఈ క్రమంలో 2023 నుంచి బోయినపల్లి తిరుమలగిరి, నాంపల్లి, జీడిమెట్ల, అల్వాల్‌తో పాటు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధుల్లో తెల్లవారిజామున 3 గంటల ప్రాంతంలో రోడ్లపైన నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీచేస్తున్నారు. దొంగిలించిన వాహనాలను రెండు మూడు రోజులపాటు పోలీసులు గుర్తించని ప్రాంతాల్లో నిలిపి వెళ్లేవారు. ఆ తరువాత కృష్ణాజిల్లా గొల్లపాలెం మచిలీపట్నంలో ఇంటర్నెట్ జిరాక్స్ సెంటర్‌ను నడిపిస్తున్న గొరిపర్తి వెంకటప్పయ్య(28) ద్వారా నకిలీ ఆర్‌సీలను సృష్టించారు. దీంతో దొంగిలించిన ద్విచక్ర వాహనాలకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి ఓఎల్ఎక్స్ యాప్ ద్వారా వాటిని రూ.10వేల నుంచి రూ.15 వేలకే విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఓఎల్ఎక్స్‌లో వాహనాలను కొనుగోలు చేసిన వారు ఆర్‌సీ అడగడంతో వారు పొంతనలేని సమాధానాలు చెప్తూ దాటవేస్తున్నారు. దీంతో అనుమానం వచ్చిన ఓ వ్యక్తి బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బోయినపల్లి క్రైమ్ పోలీసుల బృందానికి రజాక్ ఖాన్, యామాల యోహను అలియాస్ యోహను, గొరిపర్తి వెంకటప్పయ్య ముఠాగా ఏర్పడి నకిలీ ఆర్సీలను సృష్టించి వాహనాలు అమ్ముతున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతూ ఓఎల్ఎక్స్‌లో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి 8 లక్షల విలువైన 14 ద్విచక్ర వాహనాలు, ఓ ల్యాప్‌టాప్‌ను, నకిలీ ఆర్‌సీ కార్డులను స్వాధీనం చేసుకున్నామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. దీంతో ప్రతిభ కనపరిచిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్ఐ తుల్జారాం, ఎస్ఐ అనిల్, కానిస్టేబుళ్లు రమేష్, మురళి, శివశంకర్, మహేష్, శివకుమార్, శ్రీనివాసును డీసీఈ, అదనపు డీసీపీ పి.అశోక్, బేగంపేట ఏసీపీ పిగోపాలకృష్ణమూర్తి అభినందించారు.

● **జన్మదిన వేడుకలు**



కేపీహెచ్‌బీకాలనీ: టీడీపీ ఆధ్వర్యంలో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్ రమ్యగ్రౌండ్‌లో కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. షేక్ సత్తార్, అట్లూరి దీపక్, శివసత్యనారాయణ, నారాయణరావు, కొడాలి రవికుమార్, కొల్లూరి శ్రీనివాస్, కాకర్ల గోపీకృష్ణ, జాస్తి రమాదేవి, మోర్ల రామకృష్ణ, చెరుకూరి రవి తదితరులు పాల్గొన్నారు.

అంబిర్ చెరువులో మృతదేహం లభ్యం

హైదర్‌నగర్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రగతినగర్ అంబిర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన కేపీహెచ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబిర్‌చెరువలో వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతుండడాన్ని స్థానికులు గుర్తించి కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాని బయటకు తీసి పరిశీలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఏమి లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాంబేకాలనీలో కార్పొరేటర్ దొడ్ల పాదయాత్ర



చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ వాంబేకాలనీలో సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాంబే కాలనీలో కొన్నిచోట్ల బిల్డింగ్ మధ్యలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మించి ప్రధాన లైన్‌కు కలిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. జీహెచ్ఎంసీ ఏఈ శ్రావణి, వాటర్‌వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఆర్‌పీ నాగేశ్వర్‌నాయక్, సూపర్‌వైజర్ శివ పాల్గొన్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బహదూర్‌పల్లి చౌరస్తాలో కారు బీభత్సం

దెబ్బతిన్న కారు, రెండు బైక్‌లు.. పలువురికి గాయాలు

జీడిమెట్ల: బహదూర్‌పల్లి చౌరస్తాలో అతివేగంతో దూసుకొచ్చిన కారు మరో కారు, రెండు బైక్‌లను ఢీ కొట్టడంతో పలువురు గాయపడ్డారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ వ్యక్తి బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి బౌరంపేటకు వెళ్లే రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలను, కారును బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వారితో పాటు కారులో ఉన్నవాళ్లు గాయపడ్డారు. మద్యం మత్తులో కారు నడిపినందకే ప్రమాదం జరిగిందని గాయపడిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



● **నివాళి**

హైటెక్ సిటీ పేపర్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు.

ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



ప్రిన్సిపాల్ వరలక్ష్మి

చిలకలగూడ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో శాస్త్రీయ సంగీత, నృత్యాలలో శిక్షణ ఇవ్వటానికి అన్నిచర్యలూ చేపట్టినట్లు శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల, మారేడుపల్లి, ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి తెలిపారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురువా రం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, నూత న విద్యా సంవత్సరం(2024-25)లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక, హిందూస్తానీ గాత్రం, కూచిపూడి, పేరిణీ నాట్యం వీణ, వయోలిన్, మృదంగం, తబల వాద్యాలలో శిక్షణ ఇచ్చి నాలుగేళ్ల సర్టిఫికెట్, (ఫీజురూ.1100), రెండు సంవత్సరాల డిప్లొమా (ఫీజు రూ.1500) ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 10 ఏళ్ల పూర్తయిన వారు, గరిష్ఠ వయసు పరిమితి లేదన్నారు. దరఖాస్తులు కళాశాల ఆవరణలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చన్నారు. వాద్య విద్యార్థులు ఎటువంటి వాద్య పరికరాలు వెంట తెచ్చుకోవలసిన అవసరం లేదని కళాశాలలోనే అందజేస్తారని మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటలలోపు ఉంటుందని, ఆయా గంటలను విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు.

ఆలయ భూములను కాపాడండి

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న పున్నారెడ్డి

జీడిమెట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్టలో కబ్జాకు గురవుతున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ భూములను పరిరక్షించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కల్లూరి పున్నారెడ్డి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 348/1లోని 17.14 ఎకరాల స్థలాన్ని కొందరు కుల సంఘాల పేరుతో కబ్జాచేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దుర్గామాత ఆలయం వద్ద ఐదొందల గజాల స్థలాన్ని అరుణ్‌జా అనే వ్యక్తి బీఆర్ఎస్ నేతల అండదండలతో కబ్జాకు పాల్పడుతున్నారన్నారు.

● **ఏసీ గదుల్లో ప్రజావాణి**

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో తూతూమంత్రంగా సాగింది. అధికారులు సకాలంలో హాజరుకాకపోవడంతో ప్రజాసమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఓపెన్‌హాల్‌లో ప్రజావాణి నిర్వహించాల్సి ఉన్నా ఏసీ గదుల్లోనే నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి.

● **కూకట్‌పల్లి:** మూసాపేటలోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.

● **నిజాంపేట్:** మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ స్థలాల కబ్జాపై అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ వినతిపత్రం అందజేశారు.

● **ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి**

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచుతూ, ఉద్యోగాలను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కార్యాయలంలో వివిధ విభాగాల్లో స్వీపర్లు, ఎలక్ట్రిషన్‌లు, పంపు ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, ఇతర సిబ్బంది మొత్తం 537 మంది పని చేస్తున్నాము. వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

● **కొంపల్లిలో రెండు ఫిర్యాదులు**

పేట్‌బషీరాబాద్: కొంపల్లి పురపాలక సంఘంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు అందాయి. కొంపల్లిలోని అపర్ణ ఫామ్‌హౌజ్‌లో రోడ్డులు, డ్రైనేజీ, జయభేరిలో రహదారి బాగాలేదని స్థానికులు వినతిపత్రాన్ని ఆయా కాలనీల ప్రజలు కమిషనర్ శ్రీహరికి చూపించాలి.